క్లుప్తంగా

లక్ష్మీపల్లి ఉపాధ్యాయుడికి పురస్కారం



దేవరకద్ర: దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్‌కు 2025 సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కారం లభించింది. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వావ్ మ్యూజిక్, యువ తేజం ట్రస్టు, కలాం విజన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్ సీటీ కల్చరల్ హాల్లో పురస్కారాల ప్రదానోత్సవంలో భాగంగా విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తున్న ఉపాధ్యాయులు లయన్ అశ్విని చంద్రశేఖర్‌కు ఈ అవార్డును ప్రదానం చేశారు. చిత్ర నిర్మాత విజయ్‌కుమార్, ప్రముఖ సాహితి వేత్త డాక్టర్ సి.నారాయణస్వామి, వావ్ మ్యూజిక్ ఫౌండర్ పీవీ లక్ష్మి, యువతేజం కలాం ట్రస్టు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కరీముల్లా, ధర్మన్న కళాపీఠం చైర్మన్ రాధాకుసుమలు అవార్డు ప్రదానం చేశారు.

నేడు రూ.14 కోట్ల పనులకు శంకుస్థాపన

జడ్చర్ల: జడ్చర్ల పట్టణంలో రూ.14 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వరద కాల్వల నిర్మాణ పనులకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం స్థానిక ఫంక్షన్‌హాల్లో వరద కాల్వల నిర్మాణంపై సంబంధిత అధికారులతో కలిసి పవర్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

మిడ్జిల్: మండల కేంద్రానికి చెందిన సాట వెంకటయ్య, పెద్ద కూతురు ఫొటోలను మిడ్జిల్‌కు చెందిన జహంగీర్ కుమారుడు అవేజ్ నకిలీ ఇన్స్టాగామ్ అకౌంట్ క్రియేట్ చేసి పెట్టాడు. దీంతో అమ్మాయి తండ్రి ఫిర్యాదు మేరకు అవేజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనగేశ్వర్‌నాయుడు తెలిపారు. నకిలీ అకౌంట్స్ క్రియేట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు సమాజంలో సేవాభావాన్ని అలవర్చుకోవాలని పీయూ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈమేరకు పీయూలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,5,8ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాంపులను సందర్శించిన ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ లక్ష్యాలను నెరవేర్చే విధంగా ప్రజలకు మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, బాలకార్మిలకు, బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. పీయూ క్యాంపస్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ, అకాడమిక్ డైరెక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, భూమయ్య, బృందాదేవి, రవికుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: బీపీ పెరిగి గుండెపోటుతో వచ్చిన రోగికి ప్రైవేట్ ఆస్పత్రిలో సరైన వైద్యం అందించకపోవడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తికి బీపీ పెరిగి గుండెపోటు రావడంతో చికిత్సకోసం జిల్లా కేంద్రంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. సరైన వైద్యం చేయకపోవడం వల్లే మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆదివారం రాత్రి ఆస్పత్రి దగ్గర ఆందోళన చేపట్టారు. ఈ వ్యవహారంలో కొందరు నేతలు చేరుకుని సెటిల్‌మెంట్ చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని, కేసు నమోదు చేయలేదని టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం మారెపల్లి గ్రామానికి చెందిన ఇప్పలపల్లి బంగారు(27) మరో యువకుడు జడ్చర్ల నుంచి ఆదివారం రాత్రి 10గంటల సమయంలో సొంతూరికి బైక్‌పై వెళ్తూ నాగసాల సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో బంగారు అక్కడికక్కడే మృతి చెందగా, బైక్‌పై ఉన్న మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృథాగా.. ప్రభుత్వ భవనాలు

- అసంపూర్తి పనులకే కొన్ని పరిమితం
- రూ.కోట్ల నిధులు దుర్వినియోగం
- దూరదృష్టి లేని పాలకులు, అధికారులు
- ఇప్పటికైనా వినియోగిస్తే ఉపయోగం



ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి భవనం

జడ్చర్ల: జడ్చర్లలో ప్రభుత్వం కోట్లు వెచ్చించి నిర్మించిన భవనాలు, తదితర నిర్మాణాలు నిరుపయోగంగా ఉన్నాయి. 'రాజుల సొమ్ము రాళ్ల పాల్జు' అన్న చందంగా వ్యవహారం తయారైంది. దూరదృష్టి లేని పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా ఈ నిర్మాణాలు నిలిచాయి. 2006లో ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో రూ.10లక్షలు వెచ్చించి మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పిల్లర్లు, స్లాబు వరకు నిర్మాణం పూర్తి చేశారు. అనంతరం నిధుల లేమీతో నిర్మాణ పనులు వదిలేశారు. దూరదృష్టి లేకుండా దశాబ్దం కిందట సిగ్నల్‌గడ్డ వద్ద మత్స్యకార్మికుల ఉపాధి నిమిత్తం రూ.5లక్షలు వెచ్చించి ప్రధాన రహదారిని అనుసరించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ప్రస్తుతం దీనిని రోడ్డు విస్తరణ పనులలో కూల్చి వేశారు. ఈ పక్కనే లక్షలు వెచ్చించి ఎస్సీ బాలికల వసతి గృహాన్ని నిర్మించారు. దీనిని కూడా ప్రధాన రహదారిని అనుసరించి నిర్మించడంతో రోడ్డు విస్తరణ పనుల్లో కూల్చేశారు. దీని పక్కనే జెడ్పీ బాలుర పాఠశాలకు చెందిన భవనాలను కూల్చేశారు. ఇక 15 ఏళ్ల కిందట పద్మావతి కాలనీలో కూరగాయల మార్కెట్ కోసం నిర్మాణ పనులు మొదలు పెట్టి పిల్లర్ల వరకు పనులు చేపట్టి అసంపూర్తిగా వదలేశారు. ఎప్పటినుంచో 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి రెండు భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. బాదేపల్లి మార్కెట్ యార్డు సమీపంలో దాదాపు రూ.2 కోట్లు వెచ్చించి రైతు బజార్ నిర్మించారు. అన్ని హంగులతో దుకాణ సముదాయాన్ని సైతం నిర్మించారు. కోట్లు ఖర్చు చేసి నిర్మించిన రైతుబజార్ నిర్మాణాలు వినియోగం లేక వృథాగా మారాయి. 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవనం సైతం నిరుపయోగంగా ఉంది. కల్వకుర్తి ప్రధాన రహదారిని అనుసరించి కొత్తగా వంద పడకల ఆస్పత్రి నిర్మించడంతో ఇక్కడి ఆస్పత్రిని అక్కడికి తరలించడంతో పాత భవనం ఖాళీగా ఉంది. గాంధీ చౌరస్తాలో పశుసంవర్ధక శాఖకు చెందిన ఓ భవనంలో ఇన్నాళ్లు తహసీల్దార్ కార్యాలయం కొనసాగింది. కొత్తగా తహసీల్దార్ కార్యాలయానికి భవనం నిర్మించడంతో ఈ భవనం ఖాళీగా మారింది. పత్తి మార్కెట్ యార్డులో నిర్మించిన దాదాపు 20 దుకాణ సముదాయాలు నిరుపయోగంగా మారాయి. ఆయా భవనాల ఆలన పాలన కరువై ఎక్కడికక్కడ శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.



జాతీయ రహదారిని అనుసరించి నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనం

అద్దె భవనాల్లో పలు కార్యాలయాలు..

ఓ వైపు లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు ఖాళీగా నిరుపయోగంగా ఉండగా, మరో వైపు కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు లేక అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. వాటికి ప్రతి నెలా రూ.వేలల్లో అద్దె చెల్లిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ కార్యాలయంతో పాటు అనేక ప్రభుత్వ గురుకుల, హాస్టళ్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటికి ప్రతి నెలా భారీగా అద్దెలు చెల్లిస్తున్నారు. ఆయా భవనాలు, అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేసి వినియోగిస్తే పలు కార్యాలయాలకు సౌకర్యంగా ఉంటుంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు మేలుకొని ఆయా భవనాలను వినియోగించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దూరదృష్టి లేకపోవడమే..

పాలకులు, అధికారులు దృష్టి సారించక పోవడంతో భవనాల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ఉన్న భవనాలు శిథిలావస్థకు, కొత్తగా చేపట్టిన భవనాలు అసంపూర్తి దశలోనే ఆగిపోయాయి. ఇటీవల రూ.కోటి వ్యయంతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనం కూడా ఇరుగ్గా మారిందంటే పరిస్థితిని ఊహించవచ్చు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ఈ కోవలోనే ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దృష్టి సారించి అసంపూర్తి దశలో ఉన్న పనులను పూర్తి చేసేందుకు, వృథాగా ఉన్న భవనాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చర్యలు చేపడుతాం..



అసంపూర్తి భవన నిర్మాణాలు, నిరుపయోగంగా ఉన్న కార్యాలయ భవనాలపై దృష్టి సారించే విధంగా చర్యలు తీసుకుంటాం. నిరుపయోగంగా ఉన్న భవనాలలో అద్దె భవనాలలో ఉన్న కార్యాలయాలను సర్దుబాటు చేస్తే బాగుంటుంది. అదేవిధంగా నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి భవనం, తదితర వినియోగంపై స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడుతాం.

– కోనేటీ పుష్పలత, మున్సిపల్ చైర్‌పర్సన్, జడ్చర్ల

42శాతం రిజర్వేషన్ కోసం ఉద్యమం



మాట్లాడుతున్న బెక్కెం జనార్దన్

మెట్టుగడ్డ: 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం మరో మహా ఉద్యమం నిర్మిద్దామని, బీసీ జేఏసీ కన్వీనర్ న్యాయవాది బెక్కెం జనార్దన్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లుపై కోర్టు స్టే విధించినందుకు నిరసనగా ఈ నెల 14న నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చా రు. అన్ని రాజకీయ పార్టీల వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గానే చూస్తూ తరతరాలుగా అణిచివేతకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు ఏకం కావల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని, పార్టీలకు అతీతంగా, వర్గాలకు అతీతంగా ఏకమై బీసీ రిజర్వేషన్ల సాధనకు అడుగులు వేద్దామ ని కోరారు. 14న నిర్వహించే బంద్‌లో బీసీ సమాజం పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య, బీసీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మున్నూరు రాజు, ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్, పాండురంగం, గోపాల్‌యాదవ్, శాంతయ్య యాదవ్, బీసీ సమాజ్ అధ్యక్షుడు శ్రీనివాస్ సాగర్, శేఖరాచారి, పద్మశాలి నాయకులు సారంగి లక్ష్మీకాంత్, బీసీ మేధావుల సంఘం ప్రభాకర్, తెలంగాణ ఉద్యమ నాయకులు బుక్కా మోహన్‌బాబు, విశ్రాంత డీఈఓ విజయ్‌కుమార్, విద్యార్థి నాయకులు ఇమ్మడి వెంకటేష్, మైత్రియాదయ్య, రమేష్ గౌడ్, శ్యామ్ ముదిరాజ్, రజక సంఘం నాయకులు పురుషోత్తం, బోల యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించేదాక పోరాటం



దీక్షలో కూర్చున్న న్యూమోతీనగర్ కాలనీవాసులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): న్యూమోతీనగర్ కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించేదాక పోరాటం చేస్తామని న్యూమోతీనగర్ కాలనీ వాసులు పేర్కొన్నారు. న్యూమోతీనగర్ వెళ్లే దారిలో గాండ్లోని చెరువు వద్ద చేపట్టిన దీక్ష ఆదివారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా న్యూమోతీనగర్ రోడ్డు సాధన నాయకులు కాశపోగు ప్రసాద్ మాట్లాడుతూ న్యూమోతీనగర్‌కు రోడ్డు మాన హక్కు అని అన్నారు. చిన్న వానపడితే గాండ్లోని చెరువులోకి నీళ్లు వస్తాయని దీంతో 50 ఏళ్ల నుంచి ఈ సమస్య ఉందన్నారు. రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారు లు పట్టించుకోకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందుల పడుతున్నారన్నారు. గాండ్లోని చెరువు క్రమంగా కబ్జాకు గురి కావడంతో చిన్న వర్షానికి వర్షం నీళ్లు ఆడుతాయని, దీంతో మాకు ఉన్న ఏకైక మా ర్గం జలమయం అవుతుందన్నారు. ఇటీవల వాన లకు ఇళ్లలోకి నీళ్లు కూడా రావడంతో కాలనీ వాసు లు అనేక రకాల ఇబ్బందులు పడ్డారన్నారు. తమ కాలనీకి రోడ్డు ను సాధించేదాకా పోరాటం చేస్తామని హెచ్చరించారు. తమ కాలనీకి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగయ్య, భగవంతు, కొండయ్య, రాములు, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కీళ్ల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



వాకతన్ నడక ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు: ప్రస్తుతం మారుతున్న జీవనశైలీ ఆధారంగా యువకులతో పాటు వృద్ధుల్లో సురక్షితమైన జాయింట్స్ కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అవగాహన ప్రతి ఒక్కరూ చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రపంచ అర్థరైటీస్ దినోత్సవం సందర్భంగా ఎస్‌వీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పట్టణంలోని పద్మావతి కాలనీ కమాన్ దగ్గర ఏర్పాటు వాకతన్ నడకర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్‌వీఎస్ ఎండీ డాక్టర్ కేజే రెడ్డి మాట్లాడారు. అనంతరం వాకతన్ ర్యాలీ పద్మావతి కాలనీ నుంచి ఎస్‌వీఎస్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, ఎస్‌వీఎస్ ప్రిన్సిపాల్ జోషి పాల్గొన్నారు.

- ప్రపంచ అర్థరైటీస్ దినోత్సవం సందర్భంగా ఎస్‌వీఎస్ అడిటోరియంలో తెలంగాణ అర్థో సర్జన్ అసోసియేషన్(టీవోఎస్ఏ) రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్రస్థాయిలో పలువురు అర్థో వైద్య నిపుణులు హాజరై లెక్చర్ ఇవ్వడం జరిగింది. ప్రధానంగా తెలంగాణ అర్థో సర్జన్స్ అసోసియేషన్(టీవోఎస్ఏ) నుంచి 400మంది ప్రతినిధులతో సదస్సు నిర్వహించారు.

బంద్ జయప్రదం చేద్దాం



జడ్చర్ల టౌన్: బీసీ రిజర్వేషన్లు 42శాతం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తలపెట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని బీసీజాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ దళపతి ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు 22 బీసీ సంఘాలు బంద్‌కు మద్దతు నిస్తున్నాయన్నారు. బీసీలంతా స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఫకీర్ జహంగీర్, గొడుగు నర్సింహులు, రఘు, నాగేశ్, శివశంకర్, మధుసూదన్, కృష్ణ పాల్గొన్నారు.

జాబ్‌క్యాలెండర్ అమలు చేయాలి



మాట్లాడుతున్న ప్రశాంత్

జడ్చర్ల టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం జాబ్‌క్యాలెండర్ అమలు చేసి వెంటనే ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన నిరుద్యోగ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఎన్నికల ముందు మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అనేక హామీలతో వచ్చిన ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. జాబ్‌క్యాలెండర్‌ను ప్రకటించి తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు భానుప్రసాద్, మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్, డీవైఎఫ్ఐ మాజీ నాయకులు రాములు, కురుమూర్తి, రాము, అంజి, జగన్ పాల్గొన్నారు.

మీనాంబరంలో అగ్నిగుండ మహోత్సవాలు



మీనాంబరంలో హోమంలో పాల్గొన్న మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి దంపతులు

జడ్చర్ల టౌన్: మండలంలోని మీనాంబరం పరుషవేదీశ్వర ఆలయంలో అగ్నిగుండ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గణపతిపూజ, ఉదయం 10గంటలకు రుద్రహోమం చేశారు. హోమంలో బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి దంపతులు, భాస్కరాచారి, శివ, బుచ్చిలింగం, ప్రకాశం, యాదయ్య, పుట్ట పర్వతాలు కూర్చున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం గణపతి, సుబ్రహ్మణ్యస్వామి పూజలు, స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, వీరభద్రస్వామికి రుద్రాభిషేకం, బిల్వార్చన, మంగళహారతి నివేదించారు. రాత్రికి వీరభద్రస్వామిసేవ, నందికోల సేవ, పురవంతిక సేవ, పల్లకీసేవ చేశారు. సోమవారం ఉదయం అగ్నిగుండ మహోత్సవం, మహామంగళహారతి, ఉదయం 10 గంటలకు పార్వతి పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి అభినందన



అడ్డాకుల: రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్, శ్రీదేవిల కుమారుడు అభినయ్‌కి కరీంనగర్‌లో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. దీంతో శ్రీదేవి 1992–93లో మూసాపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివింది. దీంతో ఆమె మిత్రులు ఆదివారం జిల్లా కేంద్రంలో అభినయ్, ఆతని తల్లిని శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎం.శ్రీనివాసులు, ము జాయిద్, సీ.శ్రీనివాసులు, వహీద్, ఎండీ ఇంతి యాజ్, సయ్యద్ ఖదీర్, శ్రీహరిగౌడ్, ఆంజనేయులు ఉన్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ



చిన్నరాజమూర్‌లో ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దేవరకద్ర: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఓటు చోరీ విధానానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం దేవరకద్ర మండలంలోని పలు గ్రామాలలో సంతకాల సేకరణ చేపట్టారు. ఆల్‌ఇండియా కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు దేవరకద్ర ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఓటు చోరీకి వ్యతిరేకంగా చిన్నరాజమూర్, కోయిల్‌సాగర్, గద్దెగూడెం తదితర గ్రామాలలో సంతకాల సేకరణ చేశారు. ఓటు చోరీ అంశాన్ని అన్ని గ్రామాలలో బలంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోన రాజశేఖర్, వెంకటేశ్, నాగిరెడ్డి, మదన్, జాఫర్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

చికిత్స కోసం మిత్రుల సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

హన్వాడ: స్నేహితురాలి కుమారుడు అస్వస్థతకు గురై చికిత్స చేయించేందుకు డబ్బుల కోసం వెంపర్లాడుతుండగా, తామున్నామంటూ రూ.50వేలు ఆర్థికసా యం ఇచ్చి ధైర్యాన్నిచ్చిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని వేపూర్‌లో జరిగింది. వివరాల్లోకెళ్తే.. మండలంలోని వేపూర్ గ్రామానికి చెందిన జీవన్‌కుమారి కుమారుడు బ్లడ్ ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యాడు. దీంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సుమారు రూ.70లక్షల పైచిలుకు వైద్య ఖర్చులయ్యాయి. బాలుడి ఆరోగ్యం కొం త మేరకు మెరుగైంది. దీంతో ఆర్థికంగా చితికిపోయిన జీవనకుమారి తన కుమారుడికి ఇంకా చికిత్సకు, ఇతర మందుల ఖర్చులకు డబ్బులు అవసరమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న తమ పాఠశాల మిత్రబృందం జీవనకుమారిని పరామర్శించి వారి కుమారుడి వైద్యఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా వెంటనే రూ.50వేల సాయం అందించి బాసటగా నిలిచారు. మరింత సాయం అందించేందుకు కృషి చేస్తామని ధైర్యాన్నిచ్చిన మిత్ర బృందంపై స్థానికులు ప్రశంసించారు. కార్యక్రమంలో జీవనకుమారి మిత్రబృందం ఖాజీగౌడ్, వెంకటయ్య, ఆసిఫ్, షకూర్, నారాయణ, బాల్‌రాజు, కమలాకర్, శోభన్‌బాబు, తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడు మృతి



అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు చిన్న బురాన్ ఆకస్మికంగా మృతి చెందాడు. ఆదివారం బీపీఎల్ ఫౌండేషన్ సభ్యులు నివాళులర్పించి రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో వేణుయాదవ్, దయాకర్, వెంకటేష్, శ్రీధర్‌యాదవ్, గణేష్, నర్సింహ్మా, బాలకృష్ణ, ఆంజనేయులు ఉన్నారు.

సీజేఐపై దాడి రాజ్యాంగంపై దాడి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సుప్రీం కోర్టు సీజేఐపై జరిగిన దాడి రాజ్యాంగంపై జరిగిన దాడి అని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో కేవీపీఎస్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. సీజేఐ పై జరిగిన దాడి ఓ వ్యక్తి వ్యక్తిగతంగా చేసింది కాదని, అది ఆర్ఎస్ఎస్ దేశ యువతలో నింపుతున్న విద్వేషం కారణంగా జరిగిన దాడి అన్నారు. ఆర్ఎస్ఎస్ ముసుగులో న్యాయవాది రాకేష్‌కిషోర్ దాడి చేశారన్నారు. దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకుని, న్యాయ వ్యవస్థ గౌరవాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కురుమయ్య, బొయపల్లి నర్సింహులు, బాల్‌రాజ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనాథ్, భర త్, నందు, టంకర నర్సింహులు, కేశవులు ఉన్నారు.

బాలానగర్‌లో కార్డెన్ సెర్చ్



బాలానగర్‌లో కార్డన్ సెర్చ్ చేస్తున్న పోలీసులు

జడ్చర్ల టౌన్: నియోజకవర్గంలోని బాలానగర్ మండల కేంద్రంలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సమగ్ర తనిఖీ చేపట్టారు. ఎస్పీ జానకి ఆదేశాల మేరకు డీఎస్పీ రమణారెడ్డి, సీఐలు నాగార్జునగౌడ్, కమలాకర్‌లు సెర్చ్‌లో పాల్గొన్నారు. ప్రజల్లో భద్రత, నమ్మకాన్ని పెంపొందించటం, అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులను గుర్తించి నేరాలను అరికట్టడం లక్ష్యంగా నిర్వహించారు. తనిఖీలో సరైన పత్రాలు లేని 30 ద్విచక్రవాహనాలు, 6 ఆటో రిక్షాలు ధ్రువీకరణ కోసం నిలిపేశారు. డీఎస్పీ రమణారెడ్డి మాట్లాడుతూ చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కొత్త అద్దెదారుల వివరాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేయాలన్నారు. వాహనాలకు సరైన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. కార్డన్‌సెర్చ్‌లో ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బాలానగర్ ఎస్ఐ లెనిన్‌తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్: మండలంలోని వాడ్యాల్ గ్రామ సమీపంలోని దుందుభీ వాగు నుంచి ఆదివారం సాయంత్రం అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు. పట్టుబడి ట్రాక్టర్ వాడ్యాల్‌కు చెందిన కుర్వ మల్లేష్‌దిగా గుర్తించినట్లు తెలిపారు, అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏ, పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, వెంకటేష్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పీఆర్సీ కమిటీ రిపోర్టును వెంటనే ప్రకటించి, వేతనాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కిష్టయ్య, ఉపాధ్యక్షులు ఉమాదేవి, కోశాధికారి భాస్కర్, వేణుగోపాల్, అజయ్, మన్యం, హేమంత్‌కుమార్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



జడ్చర్ల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. ఆదివారం జడ్చర్లలోని మినీ బాలికల గురుకుల పాఠశాల ను ఆయన ఆకస్మిక తనిఖీ చే శారు. ఈ సందర్భంగా వి ద్యార్థినులతో మాట్లాడి సమ స్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే టిఫి న్, భోజనం విషయంలో జా గ్రత్తలు తీసుకోవాలని, మెనూ ప్రకారంగా వాటిని సక్రమంగా అందించాలని ఆయన ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.